నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: నూతన సర్వీస్ లైన్ల ఏర్పాటుతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బౌరంపేట్ సెక్షన్ ఏఈ సాయికిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు 11కేవీ బౌరంపేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నేచర్ సిటీ విల్లాస్, సారెగూడెం రోడ్డు, శ్రీవేద స్కూల్, రాజలక్ష్మి కాలనీ, 11కేవీ బాలాజీ ఎన్‌క్లేవ్ కేబుల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4:30 గంటల వరకు బాలాజీ వెంచర్, ప్రణీత్ జెమ్స్, కోటక్ కన్‌స్ట్రక్షన్స్, ఆంధ్రబ్యాంక్ వెనుక గల్లీ, సీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఖాజీపల్లి రోడ్డు, 11కేవీ కోకకోలా ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల, కేఎల్ యూనివర్సిటీ, డాలర్ డ్రీమ్స్, సింహపురి కాలనీ, గోకుల్ బృందావనం, నెస్ట్ విల్లాస్, ఎస్‌బీఐ కాలనీ, 11కేవీ మల్లంపేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు మల్లంపేట్ గ్రామం, డ్రీమ్‌వ్యాలీ, ఆకాష్ లేఅవుట్, గ్రీన్ పార్క్ కాలనీ, ఏపీఆర్ విల్లాస్, జీఎల్‌సీ భవన్స్ విల్లాస్, 11కేవీ ఏజీఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు ఎస్ఆర్ఆర్ హైట్స్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మైస్పేస్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

నిజాంపేట్ సెక్షన్ పరిధిలో..

11కేవీ జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ, బండారి లేఅవుట్ రోడ్డు నెంబరు 5 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ ఏఈ తెలిపారు.

బాచుపల్లి సెక్షన్ పరిధిలో..

11కేవీ ఓల్వా ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు సాయి అనురాగ్ కాలనీ, కౌసల్య కాలనీ, రేణుకా ఎల్లమ్మ కాలనీ, 11కేవీ జీపీఆర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల వరకు జీపీఆర్ లేఅవుట్, ఐడీపీఎల్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.


కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడనున్నట్టు కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ దూలపల్లి ఐడీఏ-1 ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సినీ ప్లానెట్, ఎన్‌సీఎల్ నార్త్, 11కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు జయభేరి కాలనీ, బ్యాంక్ కాలనీ, శ్రీనివాస కాలనీ, 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు సెంట్రల్ పార్కు, మున్సిపల్ కార్యాలయం వీధి, 11కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో అపర్ణగ్రోవ్, సెంట్రల్ పార్క్, మికాసా, 11కేవీ నూజివీడు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు నూజివీడు సీడ్స్ కంపెనీ, గజానన, రాయల్ పార్క్ ఫేజ్-2, విస్తారా మైరా, 11కేవీ ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్‌సీఎల్ కాలనీ, సినీ ప్లానెట్ ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్‌లో..

11కేవీ విద్యుత్ ఫీడర్ల ఎక్స్‌టెన్షన్ పనుల నేపథ్యంలో పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలోని 11కేవీ మీనాక్షి, 11కేవీ జీడిమెట్ల ఫీడర్ల ప్రాంతాల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేట్‌బషీరాబాద్ ఏఈ పేర్కొన్నారు.



చెరువు ఎఫ్‌టీఎల్ పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నిర్మాణాలు



చెరువు ఎగువ ఎగువ ప్రాంతం నుంచి వెనక్కి వెళ్తున్న నీరు

కబ్జా కోరల్లో లింగా చెరువు

- తూము, అలుగు పూడ్చివేత
- దీంతో చెరువులోని వాటర్ వెనక్కి
- ఎఫ్‌టీఎల్ స్థలంలో కొనసాగుతున్న నిర్మాణాలు

సుభాష్‌నగర్: సూరారంలోని లింగా చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. సూరారం ప్రధాన రోడ్డును ఆనుకుని సర్వే నెంబర్ 94లో 14 ఎకరాల 13 గుంటల విస్తీర్ణంలో లింగా చెరువు విస్తరించి ఉంది. అందులో 4 ఎకరాల వరకు కబ్జాకు గురైందని స్థానికులు చెబుతున్నారు. చెరువుకు ప్రధానం తూము, అలుగు. ఎగువ ప్రాంతం నుంచి నీటి వరద ఎక్కువ వచ్చినప్పుడు, చెరువులో నీటి సామర్థ్యం పెరిగినప్పుడు దిగువ ప్రాంతానికి అలుగు ద్వారా నీరు వెళ్తుంది. పంటలకు అత్యవసర సమయంలో నీటిని విడుదల చేయడానికి తూమును ఉపయోగిస్తారు. అదేవిధంగా కబ్జాదారులు ప్రస్తుతం ఆ చెరువుకు ఉండే 2 తూము, అలుగులను సైతం కబ్జా చేశారు. దీనికి తోడుగా చెరువు చుట్టూ ఉన్న ఎఫ్‌టీఎల్ స్థలంలో



చెరువు తూము వద్ద ప్రస్తుతం ఇలా..

నిర్మాణాలు వెలిశాయి. దీంతో అధిక వర్షం పడినప్పుడు దిగువ ప్రాంతానికి వరద నీరు వెళ్లే మార్గం లేక నీరు వెనక్కి వెళ్తుంది. దీనివల్ల ఎగువ ప్రాంతంలో ఉండే వారికి ఎప్పటికైనా జలగండం తప్పదని చెప్పవచ్చు.

అలుగు పూడ్చి.. వ్యాపారానికి ఉపయోగించి

చెరువుకు ఎగువ ప్రాంతమైన గండి మైసమ్మ, బహదూర్‌పల్లిల నుంచి వరద నీరు లింగా చెరువులోకి వస్తుంది. చెరువు నీటితో నిండినప్పుడు ఈ అలుగు గతంలో ఉధృతంగా ప్రవహించేది. అలాంటి అలుగును సైతం ఓ వ్యక్తి మట్టితో పూడ్చివేసి ప్రస్తుతం ఆ స్థలంలో బండల వ్యాపారం చేస్తున్నాడు.

హైడ్రా పట్టించుకోవాలి

ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో ఎఫ్‌టీఎల్ జోన్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణాలకు హైడ్రా అధికారులు క్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు. నర్సాపూర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువు వద్ద ఇంత తతంగం జరుగుతుంటే అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు

లింగా చెరువు ఆనుకుని ఎఫ్‌టీఎల్ పరిధిలో పూర్తిగా నిర్మాణాలు చేపట్టారు. కొంత మంది నిర్మాణాలు చేపట్టి అమ్ముకోగా.. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. చెరువులోని బతుకమ్మ ఘాట్ ఆనుకుని ఓ వ్యక్తి ఏకంగా సెల్లార్‌ను తీసి నిర్మాణం చేపట్టాడు. ఆసెల్లార్ తవ్వినప్పుడు నీరు ఉబికి వచ్చాయి. వాటిని రోజుల తరబడి నీటిని తోడి నిర్మాణాలు చేపట్టాడు. ప్రస్తుతం వర్షం పడినప్పుడల్లా ఆ సెల్లార్‌లో నీరు వచ్చి చేరుతుంది.

పంటలకు నీరు వదిలేది



కొన్ని సంవత్సరాలుగా సూరారం ప్రాంతంలో ఉన్న నాలుగు చెరువుల నుంచి పంట పొలాలకు నేను నీరు తూము ద్వార వదిలేది. ప్రస్తుతం లింగా చెరువు ఆనవాలు కోల్పోయింది. కబ్జాలతో ఇప్పుడు తూము, అలుగు ఎక్కడ ఉందో గుర్తు పట్టలేని పరిస్థితి ఏర్పడింది.

– జీతయ్య

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిజాంపేట్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్, నిజాంపేట్ కార్పొరేషన్ మున్సిపల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటరాజం కోరారు. ఈ మేరకు కమిషనర్ సౌజన్యను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లు పంచాయతీలుగా ఉన్న కాలం నుంచి 30 సంవత్సరాలుగా పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సరైన వేతనం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని వేళల్లో కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని, వారికి భద్రతా పనిముట్లు, ఆరోగ్య పరిరక్షణకు వస్తు సామగ్రిని అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్లమ్మ, పెంటయ్య, నరసింహ, సత్యనారాయణ, లక్ష్మి, అలివేలు, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

ప్రతి మహిళా సభ్యత్వాన్ని తీసుకోవాలి



మహిళలతో సభ్యత్వం చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ప్రతి మహిళా అఖిల భారత మహిళా కాంగ్రెస్‌లో సభ్యత్వాన్ని తీసుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ 40 వార్షికోత్సవం సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో పార్టీ మహిళా నాయకురాళ్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సమ్మారెడ్డి, దుర్గారాణి, రాజ్యలక్ష్మి, మధులత, అరుణ, సౌందర్య, షేక్ బీబీ, స్వరూప, పుట్టం దేవి, పద్మ, కృష్ణవేణి, శ్యామల, వల్లి రమణ, శ్రీలత, లక్ష్మి, నాగలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: వయస్సు పైబడిన వారు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్ అన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురి కాలనీ మోతీనగర్, స్నేహపురి కాలనీలోని బడ్స్ అండ్ బ్లూబ్స్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య పరీక్షలను అపోలో సౌజన్యంతో నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతి ప్రియ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రేపు జేవీవీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

సుభాష్‌నగర్: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఆదివారం గాజులరామారం డివిజన్ వల్లభాయ్ పటేల్‌నగర్‌లోని పటేల్ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కొనసాగే శిబిరంలో డాక్టర్ భార్గవ్ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి రూ.100 కే నెలకు సరిపడా మందులు అందజేయనున్నారు.

కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు

దుండిగల్: వాయు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలు, దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గండిమైసమ్మ చౌరస్తా నుంచి రింగ్ రోడ్డు వరకు అనేక గ్యారేజీలు వెలిశాయని, వాహనాలకు సంబంధించిన వ్యర్థాలను తగుల బెట్టడంతో వెలువడే పొగలతో స్థానిక ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారని తెలిపారు. అదే విధంగా బొగ్గు డిపోలు, రెడిమిక్స్ పరిశ్రమలతో దుమ్ము, ధూళి ఏర్పడి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని వివరించారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలి

బీజేపీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు సతీష్

నిజాంపేట్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానికులకే కేటాయించాలని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. శుక్రవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాచుపల్లిలో 134, డీ పోచంపల్లిలో 176 ప్లాట్లను స్థానిక కోటా కింద మంజూరు చేశారని, తక్షణమే వాటిని అర్హులకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్ రావు, మాధవ రావు, ఎల్ల స్వామి, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా



త్రిపాల్‌నాయక్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. త్రిపాల్‌నాయక్ అనే సెంట్రింగ్ కార్మికుడు రెండేళ్ల క్రితం జగద్గిరిగుట్టలోని రాజీవ్ గృహకల్పలోని రెండవ అంతస్తులో పనిచేస్తుండగా పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్ తగలడంతో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ అప్పట్లో విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి బాధితుడిని ఆదుకోవాలని ఆదేశించారు. ఇటీవల బాధితుడికి విద్యుత్ శాఖ నుంచి రూ.2 లక్షల నష్ట పరిహారం మంజూరు కాగా.. శుక్రవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బాధితుడు త్రిపాల్ నాయక్‌కు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

చెక్కులతో పాటు తులం బంగారం అందజేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు

కేపీహెచ్‌బీకాలనీ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తులం బంగారం అందజేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేపీహెచ్‌బీలోని తహసిల్దార్ కార్యాలయంలో కార్పొరేటర్‌లు సబిహా బేగం, జూపల్లి సత్యనారాయణ, శిరీష, తహసిల్దార్ స్వామితో కలిసి శుక్రవారం 210 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లి ఖర్చుల నిమిత్తం కేసీఆర్ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. అదే విధంగా చెక్కులను ఎమ్మెల్యే కార్యాలయంలో ఇచ్చే విధంగా కలెక్టర్, తహసిల్దార్ చర్యలు తీసుకోవాలన్నారు.

రేపు 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. ఇందులో 'బీయింగ్ అసెర్టివ్' అనే అంశంపై అమెరికాకు చెందిన బిహేవియర్ థెరపిస్ట్ బికే హర్ష ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

క్రీడా స్ఫూర్తితో పోటీపడాలి



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పోటీపడాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. పేట్ బషీరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో జీడిమెట్లలోని ఎంవీ రావు క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. జీడిమెట్లకు చెందిన నవభారత్ యువసేన జట్టు విజేతగా నిలిచింది. ఎంవీ రావు క్రికెట్ అకాడమీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ముఖ్య అతిథిగా డీసీపీ కోటిరెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ పోలీసులు, క్రికెట్ అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, డివిజన్‌ల పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా 56 మంది లబ్ధిదారులకు రూ.56.6 లక్షల చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. నిరుపేదల ఆడబిడ్డల వివాహాలకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకం ద్వారా ఆదుకోవటం సంతోషించదగ్గ విషయమన్నారు. పేదింటి వారి ఇళ్లల్లో సంతోషంగా ఆడపిల్లల వివాహం జరగాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రవేశపెటినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు సంజీవరెడ్డి, ప్రసాద్, లక్ష్మీనారాయణ, జిల్లా గణేష్, అనిల్ రెడ్డి, కాశీనాథ్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, ఎల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆరోగ్య కేంద్రాల నిర్వహణ?

- నిధుల కొరతతో కునారిల్లుతున్న హెల్త్ సెంటర్లు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నిర్వహణకు హెచ్‌డీఎస్ కింద ఏటా రూ. 1.75 లక్షలకు బ్రేక్
- ఏడాదికి జిల్లాలోని 38 ఆరోగ్య కేంద్రాలకు రావలసిన నిధులు రూ. 66.55 లక్షలు
- 2 ఏళ్లుగా నిధులు రాకపోవటం రోగులకు తప్పని ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: రెండేళ్లుగా నిధుల లేమితో జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ అటకెక్కింది. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు ప్రతి ఏటా హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్ మెంట్ సొసైటీ) ద్వారా ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ. 1.75 లక్షలు అందజేసేది. ఈ నిధులు రెండేళ్లుగా విడుదల కాక పోవటంతో ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహణ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇందులో 26 యూపీహెచ్‌సీలు ఉండగా, పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వీటిలో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు రోగులకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలన్నింటిల్లోనూ నిధుల లేమితో నిర్వహణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస వసతులు కల్పించలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇన్‌పేషంట్లకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి కల్పించలేని దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కలెక్టర్ పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూత్రశాల, మరుగు దొడ్లను పరిశీలించారు. హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్ మెంట్ సొసైటీ) నిధులు రావటం లేదనే నెపంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహణ సక్రమంగా లేదని తెలుసుకున్నారు.

కలెక్టర్ అసంతృప్తి..

ఆరోగ్య కేంద్రాల నిర్వహణ తీరుపై జిల్లా వైద్యాధికారిని ఆరా తీసిన కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఇలాగే ఉందనడంలో అతిశయోక్తిలేదు. వివిధ రకాల పరీక్షల కోసం బయటికి రాస్తుండటంతో ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండీ లాభమేంటనే ప్రశ్నలు పలువురి నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

- హెచ్‌ఎస్ నిధులు విడుదల కాకపోవటం వల్లనే ఆరోగ్య కేంద్రాల నిర్వహణ కష్టమవుతోంది. దీనిని గుర్తించిన కలెక్టర్ తన నిధి నుంచి తక్షణమే ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులను విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నారు.
- ఈ విషయమై పీహెచ్‌సీల వైద్యాధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావటం లేదని పేర్కొంటున్నారు. ఇవే కాకుండా ఇతర పథకాలకు సంబంధించిన నిధులు కూడా విడుదల కాలేదంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.
- నిర్వహణ నిధులు విడుదల రాగానే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస వసతుల పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పేర్కొంటున్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 400 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం కూకట్‌పల్లి మండల కార్యాలయంలో లబ్ధిదారులకు అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ పథకాలు అందేలా సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కొందరు పథకాల అమలులో ప్రొటోకాల్ అంటూ అధికారులను బెదిరిస్తున్నారని, అలాంటి వ్యక్తులకు అధికారులు ఏ మాత్రం భయపడాల్సిన అవసరం లేదన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల కోసం ఎవరికీ కమీషన్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, పుష్ప రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్, మేకల రమేష్, ప్రవీణ్, కృష్ణారాజ్‌పుత్, మధుగౌడ్, సతీష్ గౌడ్, శివ చౌదరి, బచ్చు మల్లి, మాధురి, రాము, నరసింహ, జ్యోతి, వనజ, సంధ్య పాల్గొన్నారు.

నిత్యం రద్దీనే!



షాపూర్‌నగర్ నుంచి గాజులరామారం వెళ్లే రోడ్డులో ట్రాఫిక్‌జాం

జీడిమెట్ల: షాపూర్‌నగర్‌లో ట్రాఫిక్‌జాం వల్ల ప్రతినిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షాపూర్ నగర్ నుంచి గాజులరామారం వెళ్లే రోడ్డులో సాయంత్రం 6 గంటల తర్వాత విపరీతమైన ట్రాఫిక్ జాం అవుతుంది. ప్రతి నిత్యం ఇలానే జరుగుతుండటంతో ప్రయాణికులు వారి ఇళ్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షాపూర్‌నగర్ నుంచి అదే రోడ్డులో ప్రయాణికులు జగద్గిరి గుట్ట, గాజులరామారం వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కావునా సాయంత్రం వెళల్లో జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు షాపూర్‌నగర్‌లో సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విధంగా చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.